క్లుప్తంగా

అదనపు ఉపాధ్యాయుడి కేటాయింపు

సాక్షి ఎఫెక్ట్..

ఇబ్రహీంపట్నం రూరల్: 'తరగతులు ఏడు.. ఉపాధ్యాయులు ముగ్గురు' శీర్షికతో శుక్రవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. మండల పరిధి కప్పపహాడ్ యూపీఎస్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరో ఉపాధ్యాయుడు ఎస్‌జీటీ ఆనంద్‌ను అదనంగా కేటాయించామని మండల విద్యాధికారి హీర్యానాయక్ తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

కడ్తాల్: మండల పరిధి సాలార్‌పూర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు అదే గ్రామానికి చెందిన శ్రీశైలం రూ.10 వేలు, గూడెపు సిలారి రూ.10 వేలు, గుమ్మడి చెన్నయ్య రూ.5 వేల విరాళంను చెక్ రూపంలో శుక్రవారం ఠాణాలో సీఐ గంగాధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పోలీసులు దాతలను సన్మానించారు. కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ఎస్ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, కానిస్టేబుల్స్ రాంకోటి, శ్రీధర్ ఉన్నారు.

ఎంపీఓకు పదోన్నతి



రఘును సన్మానిస్తున్న ఎంపీడీఓ తదితరులు

ఇబ్రహీంపట్నం: మండల పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న ఎస్.రఘు డీఎల్‌పీఓగా పదోన్నతి పొందారు. జనగామ డివిజనల్ లెవెల్ పంచాయతీ అధికారిగా వెళ్లారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. ఈ సందర్భంగా ఆయనకు శుక్రవారం ఎంపీడీఓ వెంకటమ్మ, సూపరింటెండెంట్ జంగయ్యగౌడ్, సీనియర్ అకౌంటెంట్ వెంకటకృష్ణ, సిబ్బంది శాలువా కప్పి సన్మానించి, అభినందనలు తెలిపారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

మంచాల: బండలేమూర్– పొర్లగడ్డతండా రోడ్డు పునర్నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని సీపీఎం మండల నాయకుడు పోచమోని కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి, యాదాద్రి, నల్గొండ జిల్లాలను కలిపే రోడ్డు.. ఆయా జిల్లాల సరిహద్దు గ్రామాల ప్రజలు నగరానికి చేరుకోవడానికి సులభమైనదని పేర్కొన్నారు. అలాంటి రహదారి పూర్తిగా అధ్వానంగా మారిందని, దీంతో ఆర్టీసీ బస్సులు రావడం లేదన్నారు. ఫలితంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.6.60 కోట్లు నిధులు విడుదల చేసిందని చెప్పారు. ప్రజా రవాణాను దృష్టిలో ఉంచుకొని, వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు.

రైతులకు అండగా ఉంటాం



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల్: విద్యుత్ అలైన్‌మెంట్ మార్చే వరకు రైతులకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీజేపీ నేత ఆచారి అన్నారు. పంట పొలాల మీదుగా ఏర్పాటు తీసిన 765 కేవీ బీదర్– మహేశ్వరం హైటెన్షన్ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ బాధిత రైతులు చేపట్టిన నిరాహార దీక్ష శుక్రవారానికి ఐదో రోజుకు చేరింది. దీనికి వారు సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, బీజేపీ మండల అధ్యక్షులు మహేశ్, రైతులు రాములు యాదవ్, వెంకటేశ్‌కుమార్ పాల్గొన్నారు.

అందరికీ పోషకాహారం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణులు

కందుకూరు: అందరికీ పోషకాహారం కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పోషకాహార సంస్థ హైదరాబాద్ నిపుణులు డాక్టర్ చెన్నకేశవులు బృందం ఆధ్వర్యంలో నేదునూరు మోడల్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆహార మార్గదర్శకాలు, స్థూల, సూక్ష్మ పోషకాల ప్రాధాన్యం, ఆహారంలో పోషక వివరాలను గుర్తించే విధానం తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. పౌష్టికాహార లోపంతో వచ్చే శారీరక సమస్యలను డిజిటల్ స్క్రీన్ ద్వారా తెలిపారు. పోషక విలువలపై చిన్నారులను ప్రశ్నలు అడిగారు. సమాధానం చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ విష్ణుప్రియ పాల్గొన్నారు.

పేరుపెద్ద.. సమస్యల తిష్ట

పేదల కోసం సర్కారు నిర్మించిన పేరుగొప్ప కాలనీ అది. నగరానికి ఆనుకొని ఉన్నా.. మారుమూల ప్రాంతాన్ని తలపిస్తోంది. అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థ. పారిశుద్ధ్య లోపం. దోమల స్వైర విహారం. వెరసి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్య సమస్యలతో అల్లాడిపోతున్నారు. ఇదీ జెఎన్యూ ఆర్ఎం కాలనీ దుస్థితి.

పేదల కాలనీపై చిన్నచూపు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ. లోపించిన పారిశుద్ధ్యం
- ఇళ్లమధ్యే నిలిచిన మురుగు నీళ్లు
- కుంటలను తలపిస్తున్న వీధులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం





ఇళ్ల మధ్య పారుతున్న మురుగునీరు.. చేతికి అందే ఎత్తులో విద్యుత్ ఫ్యూజ్ బాక్సులు

అబ్దుల్లాపూర్‌మెట్: నగర శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్‌లో జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునరుద్ధరణ మిషన్(జెఎన్ఎన్‌యుఆర్ఎం) కాలనీ అపరిశుభ్రతకు చిరునామాగా మారింది. అధ్వాన రోడ్లు, ముందుకు సాగని డ్రైనేజీ, వీధులు, రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగుతో దర్శనమిస్తోంది. డ్రైనేజీ అవుట్‌లెట్ సరిగా లేకపోవడంతో రోడ్లపై మురుగు, వర్షపు నీరు ప్రవహిస్తూ అసౌకర్యంగా మారింది. తద్వారా వస్తున్న దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమలు, ఈగలు పెరిగి విష జ్వరాల బారిన పడుతున్నారు.

నాటి సౌకర్యాలు నిల్

పట్టణ ప్రాంతంలోని నిరుపేద ప్రజలకు దివంగత నేత, ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో.. అన్ని వసతులతో కూడిన పక్కా గృహాలను జెఎన్ఎన్‌యుఆర్ఎం పథకంగా కింద నిర్మించి అర్హులకు ఇళ్లను కేటాయించారు. తొలుత సౌకర్యాలతో కళకళలాడిన కాలనీ.. అధికారుల నిర్లక్ష్యంతో నేడు మసకబారిపోయింది. సుమారు 2 వేల మంది నివసిస్తున్న ప్రాంతం.. ప్రస్తుతం సమస్యలకు నిలయంగా మారింది.

ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్స్‌లు

కొరవడిన పంచాయతీ అధికారులు పర్యవేక్షణ, పారిశుద్ధ్య కార్మికుల నిర్లక్ష్యం వలన కాలనీ మురుకివాడను తలపిస్తోంది. ఇళ్ల మధ్య ఉన్న డ్రైనేజీ మ్యాన్ హోల్స్ నిండి, వీధుల్లో పారుతోంది. తీవ్ర దుర్వాసన వస్తోంది. దానికి తోడు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వరద నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. చెత్త కుప్పలు పేరుకుపోయాయి. పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. విష సర్పాలు ఇళ్లల్లోకి వస్తున్నాయి. కాలనీలోని ప్రతి బ్లాక్ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్ ఫ్యూజ్ బ్లాక్స్‌లు



జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ

ప్రమాదాన్ని తలపిస్తున్నాయి. వీటికి రక్షణ కల్పించాలని, లేదా మరోచోట ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్తాచెదారాన్ని తొలగించి, తరచూ ఫాగింగ్ చేయించాలని, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని చెప్పినా సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యం వీడటం లేదని వాపోతున్నారు.

పట్టించుకునే వారు లేరు..



కాలనీ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నాము. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక ఇబ్బంది పడుతున్నాము. ఇళ్లమధ్య, రోడ్డుపై మురుగు పారుతూ అసౌకర్యంగా మారింది. చెత్తకుప్పలు పేరుకుపోయాయి. పేదల కాలనీపై అధికారులు, నాయకులు చిన్నచూపు చూస్తున్నారు.

– నర్సింహ, కాలనీ నివాసి

పరిష్కరిస్తాం

కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటాం. కాలనీ నిర్మాణం సమయంలో పైపులైన్లు చిన్నవి వేయడం వలన సమస్య ఉత్పన్నమయింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రూ.33 లక్షల వ్యయంతో నూతనంగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నాము.

– శ్రీవాణి, ఎంపీడీఓ, అబ్దుల్లాపూర్‌మెట్

బీజేపీ బలోపేతానికి కృషి

యాచారం: విస్తృత సేవా కార్యక్రమాలతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు అంజయ్య యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయనాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం సేవ పక్వాడలో భాగంగా నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17న రక్తదాన శిబిరాలు, 19న స్వచ్ఛ భారత్, దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళుల కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమాల పర్యవేక్షకులుగా మండల కన్వీనర్‌గా పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రవీందర్, కో– కన్వీనర్లుగా పత్తిరాజు, బీరప్పలు వ్యవహరిస్తారని తెలిపారు. సమావేశంలో నాయకులు యాదగిరిరెడ్డి, యాదయ్య, రమేష్, జంగయ్యగౌడ్, జగదీష్ యాదవ్, కృష్ణ, లక్ష్మణ్, బాషయ్య, మల్లేశ్, బాలవర్ధన్‌రెడ్డి, నరేష్, జంగయ్య, సందీప్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రైతు వేదికలో.. యూరియా పంపిణీ



రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

యాచారం: వరుస ఆందోళనల నేపథ్యంలో పోలీసుల సమక్షంలో రైతులను కూర్చోబెట్టి యూరియా పంపిణీ చేశారు. పీఏసీఎస్‌కు శుక్రవారం తెల్లవారు జామున 450 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న అన్నదాతలు భారీగా తరలి వచ్చారు. సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు.. సిబ్బందితో అక్కడి వచ్చారు. పక్కనే ఉన్న రైతు వేదికలో రైతులను కూర్చోబెట్టి, టోకెన్లు ఇచ్చారు. అనంతరం ప్రతి రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియాను అందజేశారు. ఇంకా యూ రియా అందని 60 మంది రెతులు ఉండగా.. వారికి టోకెన్లు ఇచ్చి, శనివారం రాత్రి యూరియా రాగానే అందజేస్తామని హామీ ఇచ్చారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి
- కాంగ్రెస్ కార్యకర్తలకు దిశానిర్దేశం

మహేశ్వరం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి ఘట్టుపల్లి గ్రామంలో పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ, రైతు భరోసా నిధుల విడుదల, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి కార్యక్రమాలపై ప్రచారం కల్పించాలన్నారు. గ్రామాల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త త్వరలో జరిగే ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. మహేశ్వరం గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ రాకేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ పాండు నాయక్, నాయకులు యాదయ్య, ,శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, కొమురయ్య, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనితారెడ్డి

ఆశ్రమానికి చేయూతనిస్తాం

ఎమ్మెల్యే తనయుడు కౌశిక్‌రెడ్డి

బడంగ్‌పేట్: నాదర్‌గుల్ మాతృదేవోభవ అనాథ ఆశ్రమానికి చేయూతనిస్తామని ఎమ్మెల్యే సబితారెడ్డి తనయుడు కౌశిక్‌రెడ్డి హామీనిచ్చారు. అనాథ, మానసిక దివ్యాంగుల కోసం సొంత గూడు నిర్మాణానికి సహకరించాలని ఆశ్రమ నిర్వాహకుడు గట్టు గిరి విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే స్పందించారు. శుక్రవారం తన కుమారుడుని ఆశ్రమానికి పంపించారు. ఆయన అక్కడ నిర్మాణ పనులను పరిశీలించారు. అ నంతరం ఆశ్రమాన్ని సందర్శించి మాట్లాడారు. రెండు రోజుల్లో ఎమ్మెల్యే సబితారెడ్డి.. ఆశ్రమాన్ని సందర్శించి ఒక నెల వేతనాన్ని అందజేస్తారని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని మిగతా ఎమ్మెల్యేలు కూడా అభాగ్యుల ఆశ్రమానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాసాగర్‌కు జలకళ



అనాజ్‌పూర్ ఇందిరా సాగర్ చెరువుకు జలకళ సంతరించుకుంది. గురువారం కురిసిన భారీ వర్షానికి పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతోంది. ఈ జలపాతాన్ని చూడటానికి స్థానికులు తండోపతండాలు తరలివస్తున్నారు. ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు.

–అబ్దుల్లాపూర్‌మెట్

విద్యార్థుల బాధ్యత ఉపాధ్యాయులదే

- సమాజ నిర్మాణంలో వారే కీలకం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని, సమాజ నిర్మాణంలో వారి పాత్ర కీలకమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొంటూ.. విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలని సూచించారు. అనంతరం 30 మంది టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ పాండు, లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, జోనల్ చైర్మన్ లింగయ్య, క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ మాధవరెడ్డి, జిల్లా చైర్మన్ యాదయ్య, ప్రోగ్రాం చైర్మన్ సుధీర్‌రెడ్డి, చంద్రశేఖర్, రమేశ్, క్లబ్ సభ్యులు కొండల్‌రెడ్డి, పాండురెడ్డి, మధు, సత్యం, మధుసూదన్‌రెడ్డి, పీఆర్ఓ పాషా, హెచ్ఎం రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: సమాజాన్ని చైతన్య పరచడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని తెలంగాణ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. ఈ నెల 26న మహేశ్వరం నియోజకవర్గం కందుకూరులో నిర్వహించనున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా 3వ మహాసభల పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. పాత్రికేయుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడుందన్నారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షుడు సిలివేరు యాదగిరి, కార్యదర్శి పల్లాటి జగన్, సీనియర్ జర్నలిస్టులు కుమార్, వెంకటేశ్, క్రాంతి, శ్రీను, వెంకటేశ్ గౌడ్, కుమార్, లింగం, ఉపేందర్, కృష్ణ, మల్లేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సత్తయ్య తదితరులు

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్తు



కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తదితరులు

ప్రిన్సిపాల్ మాధవరావు

ఆమనగల్లు: పట్టుదల, క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపాల్ మాధవరావు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని పట్టణంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి పాండు, సంఘ సేవకులు పాపిశెట్టి రాము దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, ఉజ్వలమైన భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని, లక్ష్య సాధనకు అహర్నిషలు కృషి చేయాలని సూచించారు. అనంతరం ద్వితీయ సంవత్సర విద్యార్థులు మొదటి ఏడాది వారికి స్వాగతం పలుకుతూ, తమ అనుభవాలను పంచుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం రామలక్ష్మి, అధ్యాపకులు జైపాల్, నాగమణి, పర్వతాలు, వెంకటయ్య, కృష్ణయ్య, చంద్రశేఖర్, విష్ణు, అలివేలు, రవి, లైబ్రేరియన్ చైతన్య, సిబ్బంది శేఖర్, విజయ, రాజు, వేణు, సుశీల తదితరులు ఉన్నారు.

కమిషనర్‌కు సన్మానం

మీర్‌పేట: చవితి నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు శుక్రవారం కమిషనర్ నాగమణిని శాలువాతో సన్మానించారు. అనంతరం సమితి అధ్యక్షుడు చిల్లంపల్లి రాజశేఖర్ మాట్లాడుతూ.. నిమజ్జనం నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. కమిషనర్ తగిన చర్యలు చేపట్టారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి నియోజకవర్గ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, కోకన్వీనర్ సోమేశ్వర్, గౌరవ అధ్యక్షుడు భిక్షపతిచారి, గోపినాథ్, కాశీరాం యాదవ్, కోశాధికారి ఎడ్ల మల్లేశ్ తదితరులు ఉన్నారు.



కమిషనర్ నాగమణిని సన్మానిస్తున్న గణేశ్ ఉత్సవ సమితి

దేశం గర్వించ దగిన నేత ఏచూరి

- ప్రజాసంక్షేమం కోసం పోరాడిన మహనీయుడు
- సీతారాం వర్ధంతిలో సీపీఎం శ్రేణులు



తుర్కయంజాల్: సీతారాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తుర్కయంజాల్: 'దేశం గర్వించ దగిన వ్యక్తి ఏచూరీ సీతారాం. నిరంతరం ప్రజల హక్కుల కోసం పరితపించిన ప్రజాస్వామికవాది' అని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని రాగన్నగూడ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే పోరాట తత్వాన్ని అలవర్చుకుని, చివరి శ్వాస వరకు కొనసాగించారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేద్దాం. ఆయన ఆశయాలను నెరవేరుద్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈ.నరసింహ, మున్సిపల్ కార్యదర్శి డి.కిషన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేవై ప్రణయ్, బి.శంకర్, నాయకులు కె.వెంకట కృష్ణ, ఆశీర్వాదం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం మండల పరిధి మంతన్‌గౌరెల్లి గ్రామంలో ఆ పార్టీ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. నాయకులు తావునాయక్, చందునాయక్ పాల్గొన్నారు.

అణగారిన వర్గాల కోసం..

మాడ్గుల: దేశం గర్వించ దగిన నాయకుడు సీతారాం ఏచూరి, అణగారిన వర్గాల కోసం పోరాడిన మహనీయుడు అని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి రమేష్ అన్నారు. ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా.. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీశ్రేణులు వెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: సీతారం ఏచూరీ ఎస్ఎఫ్ఐ సంఘంలో అనేక ఉద్యమాలు, పోరాటాలు చేశారని, ఎమ్మర్జెన్సీకి వ్యతిరేకంగా ఎదురొడ్డారని సీపీఎం మండల కన్వీనర్ పెంటయ్య అన్నారు. ఏచూరీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మహేశ్, సహాయ కార్యదర్శి వీరేశ్, నాయకులు వేణు, చింటూ, శివ తదితరులు పాల్గొన్నారు.



యాచారం: మంతన్‌గౌరెల్లిలో..



మాడ్గులలో..



కడ్తాల్‌లో..